18-2-99 ఆంధ్రప్రభ

## ప్రధానం

# బీహార్ రాజ్యం 'సేన'ల భోజ్యం...



బాలగోపాల్

బీహార్ రాష్ట్రంలో ఒక క్రూరమైన జోక్ ఉంది. దేశంలో ప్రైవేటీకరణ ఈ మధ్య వచ్చింది. కానీ బీహార్‌లో ఎప్పుడో వచ్చేసిందని బీహారీలు నవ్వుతూ అంటుంటారు. అయితే దేశంలో ఈ మధ్య వచ్చింది ఆర్థిక ప్రైవేటీకరణ కాగా బీహార్‌లో ఉన్నది పరిపాలనలో ప్రైవేటీకరణ. ముఖ్యంగా శాంతి భద్రతల ప్రైవేటీకరణ.

జోక్‌గా చెప్పుకోవడానికి ఇది బాగానే ఉంటుంది. కానీ దీని పర్యవసానం చాలా క్రూరంగా, వికారంగా ఉంటుంది. ఎవరి భద్రత వారే చూసుకోవాలంటే ధనవంతులూ, బలవంతులూ 'చూసుకున్నంత' సులభంగా బలహీనులకూ, పేదలకూ సాధ్యం కాదు.

బీహార్ గ్రామీణ ప్రాంతాలలో సమాంతరం రాజ్యం నెలకొల్పిన 'సేనలు' దీనికి తార్కాణం. రణబీర్ సేన ఈ మధ్య పేరు పొందింది కానీ 1980 ల నుండి ఇటువంటివి ఉన్నాయి. భూమిసేన, కుమారసేన, లోరిక్‌సేన, సన్‌లైట్ సేన, బ్రహ్మర్షి సేన, సవర్ణ లిబరేషన్ ఫ్రంట్ మొదలైన పేర్లతో అనేక సేనలు గతంలో పుట్టాయి. పోయాయి. తిరిగి మొలకెత్తాయి. ఈ మధ్య వార్తలలో ఉన్న రణబీర్ సేన బహుశా అన్నింటి కంటే క్రూరమైనది. లేదా అన్నింటికంటే సమర్థంగా చంపుతూ ఉందని అనాలేమో.

వీటిని తరచుగా 'భూస్వాముల సేనలు' అంటారు. కానీ ఇవి ప్రధానంగా పెత్తందారీ కులా సేనలు. రాజ్‌పుట్, భూమిహార్, బ్రాహ్మణ కులాలకు చెందిన భూస్వాములే కాక సాధారణ వ్యవసాయదార్లు కూడా ఈ సేనల వెనుక సమీకృత మవుతుంటారు. అయితే ఈ పెత్తందారీ కులాల సేనలేకాక యాదవ్, కుర్మి కులాల సేనలు కూడా ఉన్నాయి. పేదలను, దళితులను ఆ సేనలు కూడా హతమార్చాయి.

భూమి సమస్య, కూలీ సమస్య, కులం సమస్య ఈ సేనల ఆవిర్భావం వెనుక ఉన్న సామాజిక ఆర్థిక నేపథ్యం. దేశంలో ఎక్కడా లేనంత అధికంగా బీహార్‌లో కులం ఒక ప్రత్యక్ష సాంఘిక వాస్తవం. అక్కడ మనుషులు చాలా సులభంగా కులం గొడుగు కింద ఒకటవుతారు.

ఇది గ్రామీణ ప్రాంతాలలో కుల పెత్తనాన్ని కాపాడడానికే కాక ఆర్థిక ఆధిపత్యాన్ని కాపాడడానికి కూడా ఒక సాధనంగా పని చేసింది. ఈ సేనలు ప్రబలంగా ఉండే భోజ్‌పూర్, పాట్నా, గయ, జెహానాబాద్ జిల్లాలు గంగా నది లోయలో ఉన్నాయి. అక్కడ భూమి కోసం కొట్లాట చాలా తీవ్రంగా ఉంటుంది. ప్రభుత్వం శిస్తు వసూలు చేయని 'గైర్ మజుర్వా' భూములు సైతం సారవంతమయినవే. (మన రాయలసీమ జిల్లాలలో వీటిని సివాయిజమా భూములు అంటారు. ఇక్కడి భూములు ఏమంత సారవంతమైనవి కావు. ఆ భూముల కోసం భూమి లేని పేదలకూ, రైతులకూ మధ్య తీవ్రమైన ఘర్షణ ఉంటుంది. ఆ రైతులందరూ భూస్వాములు కాకపోవచ్చు.

వాళ్ళల్లో వాళ్ళకు భూస్వాములు, పెద్ద రైతులు, మధ్య తరగతి రైతులు, చిన్న రైతులు అనే తేడా లేకుండా ఉండవచ్చు. కానీ 'మాకు కూడా భూమి కావాలి' అనే దళితుల ఆకాంక్షకు వ్యతిరేకంగా ఒకే సవర్ణ కులానికి చెందిన అన్ని వర్గాల వ్యవసాయదారులనూ, వారి కులం ఐక్యం చేయగలదు. భూమి గురించి మాత్రమే కాదు. కూలీ రేట్ల గురించి, ప్రకృతి వనరుల గురించీ, నీటి పారకం గురించీ, గ్రామ పంచాయతీ రాజకీయాల గురించి కూడా ఘర్షణలుంటాయి. సమాన హక్కులే కాదు. ఏ హక్కులు కావాలని దళితుల కోరుకున్నా సవర్ణులు సహించలేని పరిస్థితి ఉంటుంది. అప్పుడు కూడా కులం ప్రాతిపదికన సవర్ణులయి ఉన్న వారు లేనివారూ ఒకటి కాగలరు.

ఇది అన్నిచోట్లా దళితులకూ భూమిహార్లకూ లేక రాజ్‌పుట్లకూ మధ్య ఘర్షణ కానవసరంలేదు. కొన్నిచోట్ల దళితులకు వ్యతిరేకంగా యాదవులు కూర్మిలవంటి బి. సి. కులాలు ఉండవచ్చు. మరికొన్ని చోట్ల అటు యువకులు లేక కూర్మిలు, ఇటు భూమిహార్‌లు లేక రాజ్‌పుట్‌లు ఉండవచ్చు. అంటే కులం నిచ్చెన మెట్ల మీద ఒకటో రెండో మెట్లు పైన ఉన్నవారికీ, కింద ఉన్న వారికీ మధ్య ఘర్షణ ఇది.

ఇక్కడ కుల సమీకరణ కేవలం భూమి పోరాటానికీ లేక ఆర్థిక పోరాటానికీ ఒక సాధనం మాత్రమేనని అనుకుంటే పొరబాటే. కుల ఆధిపత్యాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్య విషయం. అది కేవలం ఆర్థిక ఆధిపత్యం తీసుకునే రూపం కాదు. దళితుల పోరాటం కూడా కేవలం భూమి కోసం, కూలీ కోసం కాదు. అంతే ముఖ్యంగా అది ఆత్మ గౌరవ పోరాటం. కలగలిపి సాగే ఈ ఆందోళనలో ఒక దానిని భూమిక అనీ, మరొక దానిని రూపమనీ సూత్రీకరించడం సిద్ధాంత సాహసమే అవుతుంది.

నిజానికి ప్రజలు (అన్ని కులాల వాళ్ళూ) ఉపయోగించే పరిభాషనే ప్రమాణంగా తీసుకుంటే ఇక్కడ కుల పెత్తనం, దానిపైన జరిగే పోరాటమే ప్రధాన విషయాలనీ ఆర్థికంగా (భూమి పోరాటంతో సహా) అందులో ఒకానొక అంశం మాత్రమేననీ అనుకోవలసి ఉంటుంది. పరిశీలకులు బీహార్‌లోని అట్టడుగు ప్రజల పోరాటాలను ఏకంగా వ్యాఖ్యానించినా ఆ ప్రజలు మాత్రం వాటిని 'ఇజ్జత్'కు, అంటే ఆత్మ గౌరవానికి సంబంధించిన పోరాటాలుగానే పిలుచుకుంటారు. తమ ప్రత్యర్థులను కులాలుగానే గుర్తిస్తారు. తప్ప వర్గాలుగా కాదు. అయినప్పటికీ విడదీయరాని విషయాలను బలవంతంగా విడదీసి ఇక్కడ కులం ప్రధానమా లేక వర్గం ప్రధానమా అని చర్చించడంలో పెద్దగా అర్థం లేదేమో.

దళితులు, పేదలు హక్కుల కోసం ఆందోళన చేసినప్పుడు వాళ్ళను బల ప్రయోగంతో అణచడానికి గూండా గ్యాంగులను పోషించడం బీహార్ గ్రామాలలో పెత్తందారీ కులాలకు కొత్తకాదు.

కట్టెలు పట్టుకుని గ్రామాలలో 'శాంతి భద్రతలు' నెలకొల్పే ముఠాలు బీహార్ గ్రామీణ ప్రాంతాలలో సర్వత్రా ఉండేవి. దళితులు, లేక పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగానీ, సోషలిస్టులుగానీ నిలబడ్డ చోట ఈ ఘర్షణ చాలా హింసాత్మక రూపం తీసుకునేది. అయినప్పటికీ తొలి రోజులలో ఈ ముఠాల పెత్తనం కొంత అసంఘటితంగా ఉండిందనే చెప్పాలి.

కాలక్రమంలో రెండు వైపులా కట్టెల స్థానంలో తుపాకులు, బాంబులు వచ్చాయి. హింస మరింత సంఘటితంగానూ జరగసాగింది. పెత్తందారీ కులాల పక్షాన వివిధ 'సేన' లూ దళితుల పక్షాన వివిధ సి. పి. ఐ. (ఎం. ఎల్.) గ్రూపులూ నిలబడడం 1980 ల తర్వాత మొదలయింది. ఆధునిక ఆయుధాల ప్రయోగం, సంఘటితం నిర్మాణం, ఎవరిని చూసి ఎవరు నేర్చుకున్నారనేది ఈ నాటికీ ప్రశ్నార్థకంగానే ఉంది. కానీ రెండు వైపులా పరిస్థితి మారిన మాట వాస్తవం.

ఇది కేవలం సాంఘికంగా —ఆర్థికంగా మాత్రమే అసమాన పోరాటం కాదు. 'శాంతి భద్రతల' నిర్వహణ ఎంతగా ప్రైవేటీకరించబడిందనుకున్నా పోలీసు యంత్రాంగం పూర్తిగా చేతులు కట్టుకుని విలబడరు. హింసను అదుపు చేయడానికి అప్పుడప్పుడు రంగంలోని దిగుతుంటారు. కానీ ఈ పని నిష్పక్షపాతంగా చేయరు. ప్రధానంగా నక్సలైట్ల పైననే పోలీసు చర్యలు ఎక్కుపెట్టబడతాయి. తెలంగాణాలో జరిగినంతగా కాకపోయినా (అందులో పదవ వంతు కూడా కాకపోయినా) బీహార్‌లోనూ 'ఎన్‌కౌంటర్లు' జరుగుతుంటాయి. కానీ వాటిలో నక్సలైట్లు మాత్రమే చనిపోతారు తప్ప ఏ సేనల కార్యకర్తలూ ఏ రోజూ చనిపోరు. కోర్టులలోనూ పెత్తందారీ కులాల సేనలపైననే జరిగే నేర విచారణలలో సాక్ష్యాలు నమోదు కావు. వారికి శిక్షలు పడవు. తమకు వ్యతిరేకంగా సాక్ష్యం నమోదు కాకుండా చూసుకోవడంలో సి. పి. ఐ. (ఎం. ఎల్.) పార్టీలు మరీ చేతకాని వారేం కాదు. కానీ వారికి అప్పుడప్పుడు శిక్షలు పడుతుంటాయి. నాలుగేళ్ళ క్రింద ఒక కేసులు 13 మందికి ఉరిశిక్ష కూడా పడింది. (సుప్రీంకోర్టు తర్వాత కొట్టేసిందనుకోండి) — అంతేకాకుండా వివిధ పెత్తందారీ కులాలకు చెందిన సేనలు ఒకరితో ఒకరు ఘర్షణ పడిన సంఘటనలు పెద్దగా లేవు. కానీ నక్సలైట్ పార్టీలు తరచుగా తమలో తాము ఘర్షణపడుతూ ఒకరి కార్యకర్తల నొకరు చంపుకుంటుంటారు.

కాబట్టి ఇది ఏ రకంగానూ సమానపోరు కాదు. ఈ అసమాన పోరులో నాలుగయిదేళ్ళ కింద ప్రవేశించిన కొత్త సేన రణబీర్ సేన. ఇది మొదట్లో భోజ్‌పూర్ జిల్లాకు పరిమితమయి ఉన్న భూమిహార్ కులం సేన. 1997 లో పాట్నా జిల్లాలోనికీ ప్రవేశించింది. 1997 డిసెంబరు 1 వ తేదీన జెహానాబాద్ జిల్లాలోని లక్ష్మణపూర్ బూత్‌లో 62 మందిని చంపిన ఘటన రణబీర్ సేన జెహానాబాద్ జిల్లాలో పాల్పడిన మొదటి మారణకాండ. కానీ ఆనాటి హంతకులు ఆ జిల్లా వారు కారనీ లక్ష్మణపూర్ —బూతె గ్రామాన్ని అనుకుని ఉన్న ఉన్న సోన్ నదిని దాటి భోజ్‌పూర్ జిల్లా నుంచి వచ్చారనీ అందరూ భావించారు.

కానీ ఈ సంవత్సరం జరిగిన రెండు హత్యాకాండలను బట్టి చూస్తే ఈ భూమిహార్ల సేన జెహానాబాద్ జిల్లాలోనూ బలపడినట్టు అర్థమవుతున్నది. జనవరి 25 వ తేదీన ఆ జిల్లాలోని రుఖ్‌సాగర్ భీగాలో రణబీర్ సేన హంతకులు 22 మంది దళితులను కాల్చి చంపారు. ఫిబ్రవరి పదవ తేదీ రాత్రి నారాయణపూర్‌లో 12 మందిని చంపారు. రెండు సంఘటనలలోనూ హతులలో స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు. రణబీర్ సేన చేసే అన్ని హత్యలకూ ఒక సామాన్య లక్షణం ఉంది. వారు భూమిహార్ కుల ఆధిక్యతను గట్టిగా ప్రశ్నించిన వ్యక్తులనుగానీ భూమి పోరాటాలలో అగ్ర భాగాన నిలిచిన వ్యక్తులనుగానీ ఏరి చంపరు. ఒక దళిత వాడ మీదపడి నిర్దాక్షిణ్యంగా చంపుతారు. చంపుతారు అనే కంటే ఊచకోత కోస్తారు అనడం సబబుగా ఉంటుందేమో. చనిపోయే వారిలో ఏ పోరాటంలోనూ ఏనాడూ పాల్గొనని వారు ఉండవచ్చు. అసలు పోరాటం అంటే ఏమిటో తెలియని పసి పిల్లలు కూడా ఉండవచ్చు. వాళ్ళు ఊచకోత కోసం ఎంచుకునే గ్రామాలు సైతం నక్సలైట్లు నిర్వహించిన పోరాటాలుగానీ వేరే ఇతర పోరాటాలలోగానీ అగ్ర భాగాన నిలిచిన గ్రామాలు కావు. అసలు పెద్దగా ఏ పోరాటంలోనో పాల్గొన్న గ్రామాలు కావు. అటువంటి గ్రామాలను ఎంచుకుంటే ప్రతిఘటన ఎదురు కావచ్చు. కాబట్టి అటువంటి చరిత్రలేని గ్రామాలనే ఎంచుకుంటారు. పోరాటాలలో పాల్గొన్నా, పాల్గొనకున్నా ఏ దళితవాడనయినా, ఏ రోజయినా ఊచకోతకు గురి చేయగలరన్న బెదిరింపు మొత్తంగా దళితులను టెర్రరైజ్ చేయడానికి బాగా ఉపయోగపడుతుంది.

ఇప్పుడు రుఖ్‌సాగర్ భీగా, నారాయణపూర్ హత్యాకాండల ఫలితంగా రబ్రీదేవి ప్రభుత్వం రద్దయింది. రణబీర్ సేనను అదుపు చేయడానికి రబ్రీదేవి ప్రభుత్వమైనా అంతకు ముందు లాలా యాదవ్ ప్రభుత్వమైనా ఏమీ చేయలేదనేది వాస్తవమే. కానీ వారే కాదు. గడిచిన రెండు దశాబ్దాలుగా బీహార్‌ను పరిపాలించిన ఏ పార్టీ ఈ సేనలను అదుపు చేయలేదు. అటువంటప్పుడు రబ్రీదేవి ప్రభుత్వ వైఫల్యం అంటూ ఆమె పాలనను రద్దు చేయడం ఎందుకు?

పైగా రణబీర్ సేన బి. జె. పి. —సమతా పార్టీల కూటమికి చాలా దగ్గర అనేది బీహార్‌లో అందరూ ఎరిగిన బహిరంగ రహస్యం. వారి హింసను ఆసరా చేసుకుని బి. జె. పి. ప్రభుత్వమే బీహార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడం హాస్యాస్పదమనాలో విషాదం అనాలో తెలియదు. ఈ రాజకీయ కౌటిల్యం ఎట్లాగున్నా ప్రభుత్వం రద్దు వల్ల దళితులకు రణబీర్ సేన నుంచి రక్షణ లభిస్తుందని నమ్మడానికి ఆధారాలు మాత్రం ఏమీలేవు.


దళితులు, పేదలు హక్కుల కోసం ఆందోళన చేసినప్పుడు వాళ్ళను బల ప్రయోగంతో అణచడానికి గూండా గ్యాంగులను పోషించడం బీహార్ గ్రామాలలో పెత్తందారీ కులాలకు కొత్త కాదు.కట్టెలు పట్టుకుని గ్రామాలలో 'శాంతి భద్రతలు' నెలకొల్పే ముఠాలు బీహార్ గ్రామీణ ప్రాంతాలలో సర్వత్రా ఉండేవి. దళితులు, లేక పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగానీ, సోషలిస్టులుగానీ నిలబడ్డ చోట ఈ ఘర్షణ చాలా హింసాత్మక రూపం తీసుకునేది. అయినప్పటికీ తొలి రోజులలో ఈ ముఠాల పెత్తనం కొంత అసంఘటితంగా ఉండిందనే చెప్పాలి.కాలక్రమంలో రెండు వైపులా కట్టెల స్థానంలో తుపాకులు, బాంబులు వచ్చాయి. హింస మరింత సంఘటితంగానూ జరగసాగింది.